క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



మాట్లాడుతున్న ఎంఈఓ-2 సాయికృష్ణ

కూడేరు: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య నందిస్తామని ఎంఈఓ-2 సాయికృష్ణ, ప్రైమరీ స్కూల్స్ హెచ్‌ఎంలు పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. సోమవారం మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రైమరీ స్కూళ్లలోకి విద్యార్థులను చేర్పించేందుకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కమ్మూరులో ఎంఈఓ-2 సాయి కృష్ణ, హెచ్‌ఎం వెంకటరత్నమ్మ ఇంటింటికీ వెళ్లి పిల్లల తల్లిదండ్రులను కోరారు.

మట్టి పరీక్షలు చేయించాలి

కుందుర్పి: ఖరీఫ్ పంటలకు సిద్ధమవుతున్న రైతులు ముందుగా పొలాల్లో మట్టి పరీక్షలు చేయించి ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేయాలని ఏఓ మహేష్, కుసుమగిరి రైతు సంఘం సీఈఓ నరసింహమూర్తి తదితరులు సూచించారు. సోమవారం కుందుర్పి, బండమీదపల్లి గ్రామాల్లో పలువురు మట్టి పరీక్షలు చేశారు.

కంబదూరు కన్వీనర్‌కు పరామర్శ



వెంకటప్పను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: కంబదూరు పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ వెంకటప్పను కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎంపీ డాక్టర్ తలారి రంగయ్య సోమవారం పరామర్శించారు. వెంకటప్ప అనారోగ్యంతో బాధపడుతూ అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా రంగయ్య వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

పీజీఆర్‌ఎస్‌కు హాజరుకావాలి

కళ్యాణదుర్గం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమానికి డివిజన్ స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని ఆర్డీఓ వసంతబాబు సూచించారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో పీజీఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల నుంచి పలు సమస్యలపై వచ్చిన అర్జీలను ఆయన స్వీకరించారు. అనంతరం అధికారుల హాజరుపై మాట్లాడారు.

వాహనాల విస్తృత తనిఖీ

రాయదుర్గంటౌన్: నిబంధనలు పాటించకుండా రాకపోకలు సాగిస్తున్న వాహనాలను సీఐ జయానాయక్ ఆధ్వర్యంలో సోమవారం విస్తృత తనిఖీ చేపట్టారు. పట్టణంలోని మొలకాల్మూరు రోడ్డు చెక్‌పోస్టు వద్ద సీఐ వాహనాల తనిఖీ చేశారు.

ముగిసిన యల్లమ్మ జాతర

కుందుర్పి: మండలంలోని మాయదార్లపల్లిలో మూడు రోజులుగా నిర్వహించిన యల్లమ్మ, మల్లప్ప జాతర సోమవారంతో ముగిసింది. సోమవారం జలధి, గ్రామోత్సవం, మహా మంగళహారతితో ఉత్సవాలు ముగిశాయి.


బ్రహ్మసముద్రం: మండలంలోని గొచ్చిరెడ్డిపల్లిలో సోమవారం కువ్వాడమ్మ రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. అనంతరం రథోత్సవం నిర్వహించారు.

డ్రగ్స్‌కు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

రాయదుర్గంటౌన్: ఆన్‌లైన్ బెట్టింగ్, క్రికెట్ బెట్టింగ్, మట్కా, పేకాట, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసై భవిష్యతును నాశనం చేసుకోవద్దని అర్బన్ సీఐ జయానాయక్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించొచ్చని యువత, విద్యార్థులు బెట్టింగ్ యాప్స్‌కు బానిసలుగా మారి అప్పులై పాలై ప్రాణాలు మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. మరోవైపు సిటీ కల్చర్‌లో యువత గంజాయి (డ్రగ్స్)కి బానిసవుతున్నారన్నారు. రాయదుర్గం ప్రాంతంలో బెట్టింగ్, డ్రగ్స్, వ్యసనానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. రాయదుర్గం అర్బన్, మండల పరిధిలో ఎవరైనా ఇలాంటి వాటికి పాల్పడితే 9440901869కు ఫిర్యాదు చేయాలని అన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: యువత ఆన్‌లైన్ బెట్టింగ్, క్రికెట్ బెట్టింగ్, మట్కా మత్తు పదార్థాలకు బానిస కావొద్దని పట్టణ సీఐ యువరాజ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. యువత ఈజీగా డబ్బు వస్తుందని ఆశతో రూ.లక్షలు బెట్టింగ్‌లో పోగొట్టుకుంటున్నట్లు తెలిపారు. పోగొట్టుకున్న డబ్బును తిరిగి సంపాదించడానికి అప్పు చేసి మరీ బెట్టింగ్ కాస్తున్నారని చివరికి అప్పు పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యంతో ఎక్సైజ్ సిబ్బంది

రాయదుర్గం: గ్రామదట్లలో కర్ణాటక మద్యం అమ్ముతూ తలారి శారదమ్మ అనే మహిళా పట్టుబడ్డారని ఎక్సైజ్ సీఐ మహేష్‌కుమార్ తెలిపారు. ఆమె నుండి 32 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ పవన్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ హరియన్న, సిబ్బంది ఖాసీం, వెంకటేశులు పాల్గొన్నారు.

అందని బిల్లు.. తప్పని అవస్థలు

- ఆందోళనలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు
- నాలుగు నెలలుగా అందని బిల్లులు
- అప్పు చేసి పిల్లలకు అన్నం వడ్డిస్తున్న వైనం



ఉరవకొండ జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండుతున్న నిర్వాహకురాలు



మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు

ఉరవకొండ: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన బిల్లులు అందక ఏజెన్సీ నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. నాలుగు నెలలుగా పెండింగ్ ఉండడంతో అప్పు చేసి, పిల్లలకు భోజనం వడ్డిస్తున్నామని, ప్రతి నెలా సరుకులు కొనుగోలు చేయాలంటే భారమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో బిల్లులు సకాలంలో అందేవని, భోజనం నాణ్యతగా వడ్డించేవారని చెప్తున్నారు.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల పరిధిలో 777 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 1,18,530 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరి కోసం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు ఒక్కో మండలానికి ప్రతి నెలా సుమారు రూ.3 లక్షల నుంచి రూ.4లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. గత డిసెంబరు నుంచి మార్చి వరకు 9,10 తరగతులకు, మార్చి నెలలో 1నుంచి 10వ తరగతి వరకు నిధులు ప్రభుత్వం విడుదల చేయలేదు. దీనికి తోడు నిర్వాహకులు ఇచ్చే గౌరవ వేతనాన్ని రూ.2వేలు కూడా నాలుగు నెలలుగా మంజూరు చేయలేదు. మూడు నియోజకవర్గాల పరిధిలో 1,765 ఏజెన్సీలకు రూ.2,42,72,000 బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

భోజన నాణ్యతపై ప్రభావం:

పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులకు సకాలంలో బిల్లులు, గౌరవ వేతనాలు అందకపోవడంతో దుకాణాల్లో అప్పు చేసి భోజనం వడ్డించాల్సి వస్తోంది. నిత్యావసర సరుకులు, ఆకుకూరలు, కూరగాయల వ్యాపారులు డబ్బు ఇవ్వనిదే సరుకులు ఇవ్వడంలేదు. కిరాణా సరుకుల యజమానులు రెండు నెలల నుంచి సరుకులు ఇచ్చేది లేదంటూ తేల్చి చెప్తున్నారు. పాఠశాలల్లో హెచ్‌ఎంలు మాత్రం మెనూ చార్టు ప్రకారం భోజనం తయారు చేయాల్సిందేనని చెప్పడంతో నిర్వాహకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయంలో బిల్లులు పెండింగ్ లేకుండా అందించే వారని, దీంతో పాటు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందేదని నిర్వాహకులు చెప్తున్నారు.

నియోజకవర్గం	పాఠశాలలు	విద్యార్థులు	నిర్వాహకులు	గౌరవవేతనం బకాయి(రూ.లక్షల్లో
రాయదుర్గం	285	48,195	610	82.60
ఉరవకొండ	223	34,800	567	71.27
కళ్యాణదుర్గం	269	35,535	588	88.91
	777	1,18,530	1765	2,42,78,000

బిల్లులు మంజూరు చేయకపోతే ఎలా?



ప్రభుత్వం మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు నాలుగు నెలలుగా బిల్లులు చెల్లించలేదు. దీంతో మెనూ ప్రకారం భోజనం అందించడం కష్టంగా మారింది. రోజూ గుడ్డుతో పాటు ఆకుకూరలు, కాయగూరలు వాడకపోతే భోజనం నాణ్యత ఉండదు. ప్రభుత్వం బిల్లులు పెండింగ్ లేకుండా చెల్లించాలి. – శ్రీదేవి, మధ్యాహ్న భోజన ఏజెన్సీ యూనియన్ అధ్యక్షురాలు, ఉరవకొండ

అప్పు చేసి వండుతున్నాం



నాలుగు నెలలుగా బిల్లులు మంజురు కాకపోవడంతో బయట అప్పు చేసి సరుకులు కొంటున్నాం. గ్యాస్‌తో సహా కిరాణా సరుకులు, కూరగాయలు అన్నీ అప్పు పెట్టి తెస్తున్నాం. కిరాణా షాపు యజమాని అప్పులు ఇవ్వడం కుదరదంటున్నారు. ఏం చేయాలో దిక్కుతోచడంలేదు. – రామాంజనమ్మ, ఏజెన్సీ నిర్వాహకురాలు, సెంట్రల్ ఉన్నత పాఠశాల, ఉరవకొండ

బిల్లులు మంజూరుకాగానే అందిస్తాం



నాలుగు నెలల బిల్లులు విడుదల కాగానే ఏజెన్సీలకు అందించే ఏర్పాటు చేస్తాం. దీంతో పాటు గౌరవ వేతనం రూ.2వేలు కూడా త్వరలోనే మంజూరు అవుతుంది. పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం, నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నాం. – ఈశ్వరప్ప, ఎంఈఓ, ఉరవకొండ

అధికార పార్టీ నాయకుల అక్రమ కేసులకు బెదరం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

గుమ్మఘట్ట: అధికార పార్టీ నాయకులు పెట్టే అక్రమ కేసులకు భయపడేది లేదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. పార్టీ మండల కన్వీనర్ గొల్లపల్లి గౌని లక్ష్మీకాంతారెడ్డిని టీడీపీ నాయకులు అక్రమ కేసు నమోదు రిమాండ్‌కు తరలించిన విషయం విదితమే. బెయిల్‌పై వచ్చిన కాంతారెడ్డిని సోమవారం మెట్టు గోవిందరెడ్డి గొల్లపల్లి గ్రామానికి వెళ్లి పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ అధికార పార్టీ తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదన్నారు. కార్యాకర్తలకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకులు అన్యాయంగా కేసులు పెట్టి వేధించడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని విమర్శించారు. పేదలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎల్లప్ప రెడ్డి కుమారుడు కరుణాకరరెడ్డి, శృతి వివాహ రిసెప్షన్‌లో మెట్టు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు విజయేంద్ర, కేశవరెడ్డి, జెడ్పీ మాజీ సభ్యులు వన్నప్ప, పాటిల్ నాగిరెడ్డి ,వైఎస్సార్‌సీపీ నాయకులు ఉపేంద్రరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రాయదుర్గం పట్టణ, మండల కన్వీనర్‌లు మేకల శ్రీనివాసులు, రామాంజినేయులు, కణేకల్లు బ్రహ్మానంద రెడ్డి, డి.హిరేహాళ్ కన్వీనర్ రవీంద్రారెడ్డి, మురళీ మోహన్‌రెడ్డి, బోర్‌వెల్ ఆనందరెడ్డి, ఆర్టీ లక్ష్మీకాంతారెడ్డి, కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, దేవరెడ్డిపల్లి రామిరెడ్డి, అడ్వొకేట్ వెంకటరెడ్డి, చిన్నపల్లి తిమ్మారెడ్డి, మారెంపల్లి మారెన్న, పద్మనాభరెడ్డి, పోరాళ్లశివ, శంకర్‌రెడ్డి, నాగరాజురెడ్డి బేలోడు రామాంజినేయులు, అనుమేష్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు,కౌన్సిలర్లు,మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ర్యాలీ



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ముస్లింలు, వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం: వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా కంబదూరు మండల కేంద్రంలో ముస్లింలు సోమవారం ర్యాలీ చేశారు. పాత బస్టాండ్ నుంచి పోస్టాఫీసు మీదుగా అంబేడ్కర్ సర్కిల్‌కు చేరుకొని నిరసన తెలియజేశారు. ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి, జాతీయ జెండాలను చేతబట్టి పట్టణంలో ర్యాలీ చేశారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వక్ఫ్ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. అనంతరం తహసీల్దార్ బాలకిషన్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ముస్లింల ర్యాలీకి మద్దతుగా వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ నాగరాజు, భీమేష్, కన్వీనర్ హనుమంతరాయుడు, ఎంపీటీసీలు నాగరాజు, ఈరన్న, భాస్కర్, తిప్పేస్వామి, సోమశేఖర్, నాయకులు నీలిశంకరప్ప, నారప్ప, మల్లూరి వెంకటేశులు, దాదు, ఫయాజ్, రఫి, షేక్షావలి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సజావుగా ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మోడల్ స్కూల్‌లో ఏపీ మోడల్ స్కూళ్లలో 2025-26లో ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగింది. 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశానికి 414 మంది దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం జరిగిన ప్రవేశ పరీక్షకు 383 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యారు. 31 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష జరిగింది.

27.6 ఎంఎం వర్షపాతం నమోదు

రాయదుర్గంటౌన్: నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం రాత్రి 27.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. మండలంలోని కాశీపురంలో నారాయణ అనే రైతుకు చెందిన పాడి గేదె పిడుగుపాటుకు మృతిచెందింది. డి.హీరేహాళ్ మండలం కల్యంలో ఈదురు గాలులకు రేకులషెడ్లు, గుడిసెల పైకప్పులు దెబ్బతిన్నాయి.

సమతుల ఆహారంతో వ్యాధి నిరోధక శక్తి పెంపు

కూడేరు: సమతుల ఆహారం తీసుకుంటే వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని, ఆరోగ్యంగా ఉండొచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి తెలిపారు. సోమవారం కూడేరు కేజీబీవీలో 'ఆరోగ్యకరమైన జీవన శైలి' పై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి సీడీపీఓ శ్రీదేవి బహుమతులు అందించారు. కార్యక్రమంలో కేజీబీఓ ఎస్ఓ ఉమాదేవి, ఏసీడీపీఓ ఎల్లమ్మ, సూపర్ వైజర్లు రాజేశ్వరి, అరుణ, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయండి

కణేకల్లు: కణేకల్లు యూనియన్ బ్యాంకులో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని రైతు సంఘం నాయకులు జయచంద్రారెడ్డి, నాగరాజు స్థానిక బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరెడ్డిని సోమవారం కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్, క్లర్క్ పోస్టులు ఖాళీగా ఉండటంతో క్రాప్ లోన్ రెన్యూవల్ కోసం వస్తున్న రైతులు ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. బ్రాంచ్‌లో మొత్తం 8వేల వరకు ఖాతాలు న్నాయని, సిబ్బంది కొరతతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

రేపే పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కణేకల్లు: కణేకల్లు జెడ్పీహైస్కూల్‌లో 1996-97 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఈనెల23న జరుగనుందని నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక జెడ్పీహైస్కూల్‌లో బుధవారం ఉదయం సరస్వతి విగ్రహ ప్రతిష్ఠ, ఆ తర్వాత పరిచయ కార్యక్రమం, ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

టోల్‌గేట్ వసూలుకు 25న బహిరంగ వేలం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని దేవదాయశాఖ పరిధిలోని రాణీ ఛత్రం (పాత బస్టాండ్)లోని ఖాళీ స్థలంలో వాహనాల పార్కింగ్, తోపుడు బండ్ల వ్యాపారాల నుంచి టోల్ గేటు రుసుం వసూలుకు 25న బహిరంగ వేలం ఉంటుందని ఈఓ నరసింహారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మే 17 నుంచి ఏడాది కాలానికి వేలంపాట ఉంటుందన్నారు. ఉదయం 11 గంటలకు స్థానిక ప్రసన్న వేంకట రమణస్వామి ఆలయ ఆవరణలో వేలం పాట జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.లక్ష డిపాజిట్ చెల్లించాలని తెలియజేశారు.

బెల్లం ఊట ధ్వంసం

కళ్యాణదుర్గం రూరల్: కంబదూరు మండల పరిధిలోని వంకలో ఎక్సైజ్ పోలీసులు సోమవారం దాడి చేశారు. 200 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేశారు. ఎరుకల బొమ్మయ్య అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

- ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు బాలాజీ



అవగాహన సదస్సులో విద్యార్థినుల్లో ఆత్మస్థైర్యం నింపుతున్న మానసిక వైద్య నిపుణుడు బాలాజీ

రాయదుర్గంటౌన్: పరీక్షలు మార్కులే జీవితం కాదు.. గెలుపు, ఓటములను సమానంగా తీసుకొని ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలని ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు బాలాజీ విద్యార్థులకు సూచించారు. సోమవారం స్థానిక కేజీబీవీలో సమగ్ర శిక్ష జిల్లా కెరీర్ గైడెన్స్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో విద్యార్థుల మానసిక స్థితిపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు నియోజకవర్గంలోని డి.హీరేహాళ్, బొమ్మనహాళ్, కణేకల్లు, గుమ్మఘట్ట పాఠశాలలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. పరీక్షలు, మార్కులే జీవితమా? అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంఈఓ-2 వెంకట రమేష్, సమగ్రశిక్ష మెంటల్ హెల్త్ కౌన్సిలర్లు నిరంజన్, మంజునాథ్ పాల్గొన్నారు.

కష్టపడే తత్వం అలవర్చుకోవాలి

ఉరవకొండ: చదువు అంటే కేవలం పరీక్షలు, మార్కులు మాత్రమే కాదు.. క్రమశిక్షణ కష్టపడే తత్వం అలవర్చుకోవాలని జిల్లా సమగ్రశిక్ష కెరీర్ కౌన్సిలర్ లక్ష్మీపతి, ఎంఈఓలు ఈశ్వరప్ప, రమాదేవి, నిస్వార్థ ఫౌండేషన్ ప్రతినిధి తాటికొండ వెంకట్ సూచించారు. సోమవారం ఉరవకొండ కేజీబీవీలో ఉరవకొండ, కూడేరు, వజ్రకరూరు, విడపనకల్లు, గుంతకల్లు మండలాల కేజీబీవీ 10 తరగతి విద్యార్థినులు, వారి తల్లిదండ్రులతో జిల్లా సమగ్ర శిక్ష కెరీర్ గైడెన్స్ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో 'పరీక్షలు, మార్కులే జీవితం కాదు' అనే అంశంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఉరవకొండ కేజీబీవీ ఎస్ఓ ధనలక్ష్మి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఈఓ రమాదేవి మాట్లాడుతూ త్వరలో పదోతరగతి పరీక్ష ఫలితాలు వెలువడనున్నాయని, విద్యార్థులు మార్కులు తక్కువ వచ్చాయని, సబ్జెక్టులు తప్పిపోయామని మనస్థాపం చెందకుండా తొందరపాటు చర్యలు తీసుకోరాదన్నారు. కార్యక్రమంలో ఐదు మండలాల కేజీబీవీ ఎస్ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులు మానసికంగా దృఢంగా ఉండాలి

కళ్యాణదుర్గం రూరల్: విద్యార్థినులు మానసికంగా దృఢంగా ఉండాలని ఎంఈఓ-2 బాబు సూచించారు. సోమవారం పట్టణంలోని కేజీబీవీలో కంబదూరు, శెట్టూరు, కుందుర్పి, బ్రహ్మసముద్రం, బెలుగుప్ప, కళ్యాణదుర్గం మండలాల్లోని కేజీబీవీ పదోతరగతి రాసిన విద్యార్థినులు, వారి తల్లిదండ్రులకు సమగ్ర శిక్ష జిల్లా కెరీర్ గైడెన్స్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్లు గోవర్ధన్, నాగరాజు అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు మార్కులు, ర్యాంకులు మాత్రమే జీవితం కాదన్నారు. ఒత్తిడి, ఆందోళనకు విద్యార్థినులు గురికాకూడదన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన



గోవిందవాడ సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ గ్రామంలో బీసీ కాలనీకి గత నెల రోజులుగా తాగునీటి సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదని మహిళలు స్థానిక గ్రామ సచివాలయాన్ని సోమవారం ముట్టడించారు. ఖాళీ బిందెలతో సచివాలయం వద్ద ఆందోళన చేశారు.

కుందుర్పి: మండల కేంద్రంలో నాలుగు రోజులుగా తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. తాగునీటి ఆధారమైన శ్రీరామరెడ్డి మంచినీటి పథకం కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో నీటి ఎద్దడి మరింత జఠిలమైంది. దీంతో సర్పంచ్ మారుతేశ్వరి ట్యాంకర్లతో మంచినీరు సరఫరా చేస్తున్నారు. పొలాలకు వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నట్లు పైగేరీ ప్రాంతానికి చెందిన వారు తిమ్మప్ప,లక్ష్మీదేవి, రాధమ్మ తెలిపారు.

బియ్యం ఇవ్వకపోతే ఎలా బతకాల నాయనా..!



మూన్నెళ్లుగా బియ్యం ఇవ్వలేదని తహసీల్దార్‌తో ఆవేదన వ్యక్తం చేస్తున్న భీమలింగమ్మ

ఉరవకొండ: బియ్యం ఇవ్వకపోతే ఎలా బతకాల నాయనా.. అంటూ పట్టణంలోని మారెమ్మ వీధిలో నివాసం ఉంటున్న భీమలింగమ్మ తహసీల్దార్ మహబూబ్ బాషా వద్ద కన్నీళ్లు పెట్టుకుంది. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 93 ఏళ్ల భీమలింగమ్మ నడవలేని స్థితిలో వెళ్లింది. నెలనెలా మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద ఇచ్చేవారని, మూడు నెలలుగా రేషన్ ఇవ్వకపోవడంతో పస్తులుంటున్నానని తహసీల్దార్ మహబూబ్‌బాషాతో ఆవేదన వ్యక్తం చేసింది. వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటి వద్దకే వచ్చి పింఛన్ ఇచ్చేవారు.. బియ్యం అందేవి.. కూటమి సర్కారు వచ్చిన తర్వాత వృద్ధులు, దివ్యాంగులను కూడా అవస్థల పాలు చేశారని జనం చర్చించుకోవడం కనిపించింది.

గంగమ్మబావి అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి



గంగమ్మబావి రిజిస్ట్రేషన్ రద్దు చేయించాలని కోరుతూ ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

రాయదుర్గం: పట్టణంలోని బళ్లారి రోడ్డులో వంద ఏళ్లుగా ఉండే గంగమ్మబావి స్థలాన్ని కామ్మూర్తి లక్ష్మీ నరసింహస్వామి కబ్జాచేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని ఆ కాలనీవాసులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ నాగరాజు, కమిషనర్ దివాకర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. కాలనీవాసులు మాట్లాడుతూ ఈ బోగస్ రిజిస్ట్రేషన్‌ను రద్దుచేసి ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని కోరారు. వంద ఏళ్ల క్రితం తాగునీటి కోసం గంగమ్మ అనే మహిళ ఈ బావిని తవ్వించి ప్రజలకు దాహార్తి తీర్చినట్లు తెలిపారు. గంగమ్మ బావికి ఆనుకొని నివాసం ఉన్న లక్ష్మీ నరసింహస్వామి బోగస్ పట్టా సృష్టించి ఏకంగా అనంతపురంలో రిజిస్ట్రేషన్ చేసుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. శాంతినగర్‌లో ఎక్కడో ఉండే 229 సర్వే నంబర్‌కు గంగమ్మబావి చుట్టూ ఉండే చెక్ బందీ వేయించి, బావి ఫొటోను సైతం మార్ఫింగ్ చేశాడని ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్, కమిషనర్ తెలియజేయడంతో కాలనీవాసులు వెనుదిరిగారు.

ఆక్రమిత స్థలంపై ఫిర్యాదు

గుమ్మఘట్ట: దళితుల ఇళ్ల స్థలాన్ని అగ్రవర్ణాల వారు ఆక్రమించడంతో కేపీ దొడ్డి గ్రామస్తులు రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులుకు సోమవారం ఫిర్యాదు చేశారు. మండలంలోని కేపీ దొడ్డి ఎస్సీ కాలనీలో అగ్రవర్ణాల వారు షెడ్డును నిర్మించుకున్నారని గ్రామస్తులు పుట్టమ్మ, ఎల్లక్కమల్లక్క, దురుగమ్మ,లస్మక్క, పార్వతి,నాగమ్మ, పెన్నప్ప, బసప్ప, నాగప్పతో పాటు 40 మంది ఫిర్యాదులో తెలిపారు.

ఐకమత్యంగా పోరాడుదాం

గుమ్మఘట్ట: దళితులందరూ ఐకమత్యంతో పోరాడుదామని ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు అన్నారు. తాడేపల్లిగూడెంలో ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌బాబుతో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయదుర్గంలో ఎస్సీలపై జరుగుతున్న హింసాత్మక దాడులు, దౌర్జన్యాలపై సమావేశంలో చర్చించారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి దళితులందరూ ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. టీడీపీ దళిత హక్కులు కాలరాస్తోందని, ఆపార్టీ దుర్మార్గాలు అన్నీఇన్నీ కావన్నారు. టీడీపీ నాయకులు చేస్తున్న అవినీతి, అక్రమాలు,దౌర్జన్యాలను ఎక్కడికక్కడ, ఎప్పుడికప్పుడు ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

గాలివాన బీభత్సంతో పంటలు నష్టం



శెట్టూరు: నేలకూలిన బొప్పాయి తోట



చాబాల రోడ్డులో కూలిన విద్యుత్‌స్తంభం

శెట్టూరు: మండలంలో రెండు రోజులుగా గాలీవానకు ఉద్యాన పంటలు నష్టపోయినట్లు బాధిత రైతులు తెలిపారు. అయ్యగార్లపల్లి, బచ్చేహళ్ళి, శెట్టూరు, కనుకూరు, ములకలేడు తదితర గ్రామాల్లో ఉద్యాన పంటలు నష్టపోయారు. అయ్యగార్లపల్లిలో సుమారు 5 ఎకరాలలో బొప్పాయి, ఏడెకరాల్లో మామిడి తోటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం పరిహారం అందించాలని రైతులు భారతి, జబీసాబ్, నాగేంద్ర, గోవిందరెడ్డి కోరారు.

ఉరవకొండ: పట్టణంలో ఈదురు గాలులకు పలు కాలనీల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఆదివారం అర్ధరాత్రి ఈదురు గాలులకు గుంతకల్లు రోడ్డు, అంబేడ్కర్ నగర్, శాంతినగర్‌లో చెట్లు పడిపోయాయి. చాబాల-హోతూరు రోడ్డు వద్ద ప్రధాన రహదారిపై భారీ విద్యుత్ స్తంభం కిందకు పడిపోవడంతో వెంటనే స్పందించిన సిబ్బంది విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

వీరశైవులను ఓబీసీలుగా గుర్తించాలి

- గవిమఠం పీఠాధిపతి జగద్గురు చెన్నబసవ రాజేంద్రమహాస్వామి



మాట్లాడుతున్న గవిమఠం పీఠాధిపతులు

ఉరవకొండ: వీర శైవులను ఓబీసీలుగా గుర్తించాలని గవిమఠం పీఠాధిపతులు జగద్గురు చెన్న బసవరాజేంద్రస్వామి, ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవ రాజేంద్రస్వామి అన్నారు. సోమవారం స్థానిక గవిమఠం పీఠాధిపతుల వారి విశ్రాంతి భవనం వద్ద నియోజకవర్గ వీరశైవ సంఘం నాయకుల సమావేశానికి గవిమఠం పీఠాధిపతులు, ఉత్తరాధికారి హాజరయ్యారు. వీరశైవ సంఘం నాయకులు మాట్లాడుతూ బసవేశ్వర జయంతిని ఇదివరకే కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ ప్రభుత్వాలు అధికారికంగా గుర్తించి అమలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం ఏపీ ప్రభుత్వం కూడా బసవేశ్వర జయంతిని కూడా అధికారికంగా నిర్వహించనుండడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం వీరశైవ సమాజం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. ఉరవకొండలో మే 1న జరిగే బసవ జయంతి వేడుకలకు నియోజకవర్గ వ్యాప్తంగా వీరశైవులు పెద్ద ఎత్తున తరలిరావాలని పీఠాధిపతులు కోరారు. కార్యక్రమంలో వీరశైవ సంఘం నాయకులు నిరంజన్‌గౌడ్, నాగన్నగౌడ్, వీరేష్, మోపిడి చంద్రమౌళి, బొజ్జప్ప, సత్యనారాయణ, వీరేష్‌స్వామి పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



విద్యార్థిని శైలును అభినందిస్తున్న ఎంఈఓ మల్లారెడ్డి

బెళుగుప్ప: మండలంలోని హనిమరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం బాల హరినాథ్ అధ్యక్షతన పాఠశాల వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. ఎంఈఓ మల్లారెడ్డి, గ్రామ సర్పంచ్ మారుతమ్మ పాల్గొన్నారు. పాఠశాలలో ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయిన విద్యార్థిని వై.శైలును అభినందించారు. ఉపాధ్యాయుడు హుస్సేన్ ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికయిన విద్యార్థులకు ఏటా రూ.1000 నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అర్జున్, హరిబాబు, హారిక, రేణుక, గాయిత్రి, భారతి పాల్గొన్నారు.